# 7 నిజమైన ప్రేమకథ

"కండక్టరుకి చెప్పేను. ఈ పెట్టెలోకి ఇంకెవర్నీ ఎక్క నివ్వద్దని....మీకు డిస్టర్బెన్స్ ఉండదు...."

"థాంక్స్...."

పిపాయి నా సూట్‌కేసులు రెండూ మీది బెర్తుమీద అమర్చి పెట్టి నీళ్ళ సీసా దానిస్థానంలో పెట్టి, హేండ్‌బేగ్ సీటుపక్క చిన్న టేబిల్‌మీద పెట్టి గాజు కిటికీలని ఎత్తిపెట్టేడు-నాకు గాలి తగలకుండా కాబోలు. రైలుస్టేషను దాటగానే నావైపు కిటికీ దించుకుంటాను.

"రాజమండ్రిలో వెంకటరావు మిమ్మల్ని కలుసుకుంటాడు — అప్పటికి మీ ప్రోగ్రాం నిర్ణయిస్తే అతనికి చెప్పండి...."

"అలాగే"

మనిషి వొంగినా, తాము వంగని అతని ఖాకీబట్టలు ఎందుకో నాకూ గర్వం కలిగించేయి. నేను యూనిఫారమ్ వేసుకునే రోజుల్లో ఇంత జాగ్రత్తగా వుండేవాడిని కాదు. అదంటే వొళ్ళుమండేది. కాని చక్కగా ధరించిన యూనిఫారమ్‌లో చాలా అందం ఉంది.

అతన్ని కూర్చోమని నేనూ కూర్చున్నాను.

రెండు దాటుతూంది.

మెయిలు స్టేషను వొదిలేందుకు ఇంకా పదినిముషాలు టైమ్ ఉంది.

"మీరు వెళ్ళండి—ఇంకా ఆలస్యం ఉంది రైలుకి. నాకేం అవసరంలేదు" అన్నాను.

కంగారుగా చూశాడు అతను.

"వెయిట్ చేస్తాను" అన్నాడు.

చిరునవ్వు ఆగలేదు.

మధ్యాహ్నం లంచికి అతని ఇంటికివెళ్ళేను. అతనీమధ్యనే పెళ్ళి చేసుకున్నాడు. స్వస్థానంనించి వెయ్యిమైళ్ళు దాటి, ఉద్యోగ ధర్మంగా ఇక్కడ ఉంటున్నాడు. అతని జీవితం ఎలాగ ఉంటుందో నాకు తెలుసును. నేనూ ఈ పరిస్థితులు అనుభవించిన వాడినే!

అందుకే, మధ్యాహ్నం నేను పొరపాటుగా విన్న, అతని భార్యమాటలు మరిచిపోలేదు. నేను చేతులు కడుక్కుంటూంటే ఆమె టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఎక్కడికో వెళ్ళడానికి మూడు గంటలకి ఏర్పాటుచేసుకుంది. అందుకోసం కారులో పెట్రోలుపోసి తీసుకు రమ్మనీ, రెండూ నలభైకి రావాలనీ, ఆమె భర్తతో చెప్పింది. నాకు మళయాళం ఆమాత్రం తెలుసునని ఆమెకీ అతనికీ ఏం తెలుసును? వాళ్ళమాటలు విన్నాననే తెలీదు?

"వొద్దు-వెంటనే తిరిగి వెళ్ళండి—" అన్నాను.

అతను సంశయించేడు.

"అది ఆర్డరు" అన్నాను సగం సీరియస్‌గా.

ముఖంలో ద్యోతకం ఔతూన్న రిలీఫ్‌ని డిసిప్లిన్‌లో దాచుకోడానికి ప్రయత్నించి, సెల్యూట్‌చేసి అతను వెళ్ళబోయాడు.

కరచాలనంచేసి, "ఈ లాంఛనాలకన్న, భార్యలకి ఇచ్చిన వాగ్దానాలు ముఖ్యం! త్వరగా వెళ్ళండి" అన్నాను.

అతను పూర్తిగా వికసించిన చిరునవ్వుతో మళ్ళీ సెలవు తీసుకుని త్వరగా వెళ్ళిపోయాడు. సిపాయినీ పంపేశాను.

వెళ్ళిపోయేటప్పుడు ఒంటరిగా వెళ్ళటం ఇష్టం నాకు. ప్రయాణంలో నా ఆలోచనలతో ఒంటరిగా వెళ్ళడం ఇష్టం నాకు.

రైలు కదిలే సూచనలన్నీ వినిపిస్తున్నాయి. కిటికీలోనించి పచ్చజండా కనిపిస్తోంది.

ఆ సమయంలో హడావుడిగా ఇద్దరు వొచ్చారు....అన్ని కంపార్టుమెంట్లూ తలుపులువేసి ఉన్నాయి- నాది తప్ప.

ఆమె క్షణమాత్రం ఆగి, లోపలికి వొచ్చింది. ఆమె వెనుక అతను- అతని వెనుక పోర్టరు.

హడావుడిగా సామాన్లు అవతలి బెర్తుమీదా, సీటుకిందా సర్ది పెట్టి పోర్టరు బయటికి వెళ్ళేసరికి రైలు నెమ్మదిగా కదలసాగింది.

"ఉంటాను సుశీలా!....మరిచిపోకు" అంటూ అతను త్వర త్వరగా దిగి కట కటాల అవతల్నించి కనిపిస్తూ ప్లాట్‌ఫారమ్‌మీద పది అడుగులు నడిచి, మరో పది అడుగులు పరిగెట్టి మాయం ఐపోయేడు. ఆమె అతనివొంక చూస్తోంది గుమ్మందగ్గిర నిశ్చేతనగా నిలబడి.

రైలు తన నిడువైన శరీరాన్ని క్రమ క్రమంగా లాగుతూ కష్టంతో వేగం పుంజుకుంటూంది.

ఆమె నీరసంగా వొచ్చి కూర్చుంది. అమె ఎలాగ ఉందో, ఏ లక్షణాలని వ్యక్తపరుస్తూందో ఏమీ చూడలేదు నేను- ఆమె కళ్లల్లో దుఃఖం, నిరాశ కలిగించిన బాధతో నిండిపోయిన చూపులో ఆ ఆవేదనలో నా ఆలోచనలన్నీ కరిగిపోయాయి.

నా ఏకాంతంలోకి వొచ్చి ఆమె నా శాంతిని పాడు చేసిందనే భావం వొచ్చీ రావడంతోనే తిరిగి మాయం ఐపోయింది ఆ కళ్ళ లోని భావాలు వాతవేసినట్టు నా మనస్సులో ఉండిపోయి ఆమె ఏకాంతంలోకి వెళ్ళి నేనే ఏదో నేరం చేసినట్లనిపించాయి.

ఆమె ఒకమూలకి జరిగి, ఒదిగి కూర్చుంది—ఇరుకైపోయి నట్టు....ఆమె ఎఱ్ఱటికళ్ళు మళ్ళీ మంటలాగ బాధించేయి నన్ను.... మరుక్షణం అంతసేపూ ఆమె దాచుకున్న కన్నీళ్ళు ఒకసారి బయటికి వొచ్చాయి. ఆమె రుమాల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా ఏడుస్తోంది. కాని, ఆమె నానించి ఏమీ దాచుకోలేక పోయింది. ఆమె కంపిస్తోన్న శరీరం భూమి కంపిస్తోన్నట్టు నన్ను గాభరా పెడుతోంది. ఆ దుఃఖ

మూర్తికి నిజంగానే ఆ చిన్న రైలుపెట్టె తన ప్రపంచం. అందులో నేను అక్కడ ఉండకూడని పరాయిని....ప్రభుత్వం ఆ పెట్టెలో ముగ్గురు కూర్చునే ఆజ్ఞ అయఃఫలకంమీద రాసి బిగించినా, దైవం ఆ క్షణాల్లో ఆమెకి కనీసం ఆ ఏకాంతం ఐనా ఇచ్చి ఉండాల్సింది.

ఒక్కసారి పెల్లుబికి వొచ్చిన ఆమె దుఃఖం నాకు వర్షాకాలపు తొలి మేఘాలని జ్ఞాపకం తెచ్చింది. అవీ నీటిని అలాగే దాచుకుని ఒక్కసారి జలదరించి వర్షిస్తాయి. స్త్రీకూడా అలాగే కన్నీళ్ళని దాచుకోనూ కలదు....ఒక్కసారి వర్షించనూ గలదు.

కష్టంగా కళ్ళు తిప్పుకున్నాను.

ఆమె కళ్ళ జ్ఞాపకాల్లోంచి మనస్సుని తిప్పుకోలేక పోయాను, ఈ కౌమార దశలో యౌవనపు రోజులు జ్ఞాపకంవొచ్చి. వాటిలో అందమైన కళ్ళు కార్చిన కన్నీళ్ళు ఇన్ని సంవత్సరాల తరవాత నన్ను బాధింపడం మానివేశాయి. ఆ కన్నీళ్ళు ఆరోజుల్లో కలిగించిన భరించలేని ఆవేదన ఈ రోజుల్లో కలిగించడంలేదు. అలమరలలో దాచుకున్న జ్ఞాపకాలవి. ఒక్కొక్కప్పుడు నాకు సిగ్గుకూడా వేసేది, ఆ రోజుల మనిషిని నేనేనా అని. అలాటి భావన కలిగినప్పుడు యౌవన దౌర్బల్యంగా ఆ క్షణాలని క్షమించి, నన్నూ, ఆ కళ్ళ వెనుకటి ఆమెనీకూడా క్షమించుకునేవాడిని.

అనుభవాలు కొండల్లాటివి. వాటిదగ్గరగా ఉంటే అవి ఎంతో భరించలేనివిగా కనిపిస్తాయి. దూరంగా వెళ్ళినకొద్దీ వాటి ప్రాముఖ్యం తగ్గిపోతుంది ఆ దూరం నేలమీదనే కావొచ్చును, కాలంలోనూ కావచ్చును.

అది నా అనుభవం.

నేను మనసులేని వాణ్ణికాను. మానవుణ్ణి.

ఆ భావనా పవిత్రమైన ఆమె పరిసరాల్లో నాకు గర్వం కలిగించనేలేదు. ఆనాడు హృదయాల్లో ప్రజ్వలించి, రగిలించిన ఆ బాధల్ని ఈనాడు మరిచిపోవడం ఏం మానవత్వం? నా వయసులో సగంఉన్న ఈమె దూరం చేసుకున్న మనిషికోసం ఎంత బాధ పడుతోంది.

రైలు వేగంగా సాగిపోతుంది.

ఆమె క్రమంగా సర్దుకుంటున్నట్టు ఉంది.

నిన్నరాత్రి నిద్రలేదు—శేఖర్ బ్రిడ్జిలో కూర్చోబెట్టి "రేపు ఆదివారం కదా! రైల్లో నిద్రపో!" అంటూ రాత్రంతా జాగరణ చేయించేడు. రెండయాక నిద్రపోదామనుకున్నాను. ఆ సమయంలో నా పార్ట్నర్‌గా శేఖర్ గ్రాండ్‌స్లామ్ బిడ్ చేశాడు. ఒక ఆసు అవతలివాళ్ళ చేతుల్లోఉన్నా, లీడ్ మరోరంగు కావడంతో డబుల్, రిడబుల్ ఐనా, స్లామ్ ఐపోయింది. దానితో నిద్ర దూరంగా పోయింది.

కాని, ఇప్పుడు నిద్ర జయించసాగింది. మూడు కావస్తూంది.

ఆమెకి ఏకాంతం ఇవ్వొచ్చును. నా శరీరాన్ని విశ్రమించనివ్వవొచ్చును. కూర్చునే నిద్రపోయాను.

రాజమండ్రి వొచ్చేదాకా తెలివిరాలేదు. లేచేసరికి బయట గొడవ వినిపించింది. వెళ్ళి ముఖం కడుక్కొని వొచ్చేసరికి కాఫీ టిఫిన్ రెండుసెట్లు తెచ్చాడు బేరర్.

"మీకోసం ఆర్డరు చేశాను. కండక్టర్ వొచ్చేసరికి మంచి నిద్రలో ఉన్నారు" అంది ఆమె.

ధన్యవాదాలు చెప్పి తినడం, కాఫీ తాగడం ముగించాను. రైలు కదిలేదాకా జ్ఞాపకం రాలేదు—నా కోసం వెంకటరావు వొస్తాడని.... బహుశా అతను కంపార్టుమెంటులన్నీ వెతికి నేను కనిపించక వెళ్ళిపోయి ఉంటాడు. తలుపుతీసి ఉంచవలసింది.

నేను కిటికీలోనుంచి చూస్తూ ఆలోచిస్తూంటే హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. వాల్తేరులో ఆమెని దిగబెట్టడానికి వచ్చిన దెవరు?....ప్రేమించినవాడా?

ఆమెలో పొంగివొచ్చిన భావోద్రేకంలో నేనూ మునిగిపోయి నాకు తెలియకుండానే కథ కల్పించుకున్నాను. వాళ్ళు ప్రేమించుకుని ఉంటారు....ఆమె ఎందుచేతనో వెళ్ళిపోతూన్నది—అని. ఎన్నో ప్రేమకథలు చదివేక ఉద్రుతమైన ప్రేమ అవివాహితులమధ్యనే పరాకాష్ఠ చెందుతుందనే సూత్రం మెదడులో నాటుకుపోయి. అనుకుంటాను.

ఆమె నా ఎదురుగా అవతలి కిటికీ దగ్గర కూర్చున్నది. ఆమె మెడలోని మంగళసూత్రం సన్నటి చీర చెరగుల్లోంచి స్పష్టంగా కనిపిస్తోంది.

నాకు గర్వంతోపాటు కొంత బాధకూడా కలిగింది. బాధ ఎందుకంటే- ఆమె నా కంపార్టుమెంట్‌లోకి రాగానే ఆమె మంగళ సూత్రాన్ని గమనించలేదే అని. అప్పుడు ఆమె మెడలో గొలుసు ఒక్కటే కనిపించినట్లు స్పష్టంగా జ్ఞాపకం నాకు. బహుశా నా గమ నించే శక్తి మందగిస్తోం దనిపించింది.

నా ఉద్యోగం అలాటిది. విషయాలని గమనించే బాధ్యత నాది. ఆ శక్తి సన్నగిల్లడం....

కాని, భర్తను విడిచిపెట్టి కొద్దిరోజులు వెళ్ళినందుకు ఆమె అంత బాధపడడం నాకు గర్వం కలిగించింది. దిద్దిపెట్టుకున్న ఆమె సింధూరపు తిలకంచూసి ఎంతో నమ్మిక కలిగింది ఆమె పవిత్ర హృదయంమీద. వ్యక్తిత్వపు విలువలూ, మానసికపు విలువలూ క్షణక్షణం మట్టిలో కలిసిపోతూన్న ఈ రోజుల్లో ఈమె తన భర్తని అంతగా ప్రేమించగలగడం, అతన్ని వొదిలి రావాల్సిన ఈ చిన్న వియోగం ఆమె నంతగా కదపగలగడం ఆమెపట్ల ఆత్మీయత, గర్వంతో కలిసి, నాకు కలిగించింది.

"ఎక్కడిదాకా వెడతారు మీరు?"

ఎంతో చక్కటి కంఠం

"బెజవాడ.....మీరు?"

"నేనూ అక్కడికే...."

తనని బహువచన ప్రయోగం చెయ్యవద్దంటుందని ఎదురు చూశాను. కాని అలాటి దేమీ అనలేదు.

"రాత్రి తొమ్మిదికి చేరుతా మనుకుంటాను."

"అవును. కొంత మేకప్ చేశాడు."

"అలాగ అనకండి....ఇవి గో-స్లో రోజులు, డ్రైవరుకి విని పిస్తే యూనియన్ జ్ఞాపకంవచ్చి మళ్ళీ వేగం తగ్గిస్తాడు!"

ఆమె నవ్వింది...."అదీ నిజమే!" అంటూ.

ఆ నవ్వుతో ఆమె ముఖం అంతా కళ్ళల్లో కాంతితో వెలిగి నట్లయింది. గంటలక్రిందట చూసిన దుఃఖమూర్తి ఎక్కడికోవెళ్ళి ఈ సుహాసిని ఇక్కడికి వొచ్చిందా అనిపించింది. నా హృదయంలో ఈ అమ్మాయికి ఇచ్చిన సింహాసనంలోనించి ఆమె ఎంతో అందంగా కనిపించింది.

కాని—నాకు ఏదో లోటూ కనిపించింది. ఈమె దుఃఖం ఎక్కడికి పోయింది? ఆ ముఖంలో పొరలివొచ్చిన దుఃఖం ఆమె మనస్సుని పూర్తిగా ప్రక్షాళనం చేసివేసిందా?

అలాగే ఐతే ఈమెని ఎలాగ గౌరవించేది?

కొన్ని నిమిషాలలాగే నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఆమె ఏదో ఆలోచిస్తూన్నట్టుంది. మధ్యమధ్య దాచుకోలేని జ్ఞాపకాలు ఆమె కళ్ళల్లోకి వొస్తూన్నట్టున్నాయి. వాటి కాంతి ఉండీ ఉండీ తగ్గి పోతోంది. అతను చివరి నిమిషంలో ఆమెతో అన్నమాటలు నాకు జ్ఞాపకంవొచ్చి, అతని బాధనీ అర్థం చేసుకున్నాను. ఈమె తనని వొదిలి వెళ్ళిపోయే కొద్దిరోజుల్లో ఆమె తనని మరిచిపోతుందని అతని బెంగ.

కాని, సుశీల ఎంతత్వరగా తన చిరునవ్వుని మళ్ళీ తెచ్చుకో గలిగింది!

ఆ నిజమూ అట్టేసేపు బాధపెట్టలేదు నన్ను.

చాలాకాలం కిందట జరిగిన ఒక సంఘటన నాకు జ్ఞాపకం వొచ్చింది. సుమారు రెండు దశబ్దాలు తరవాత ఆ కథ ఇదే అను మళ్ళీ జ్ఞాపకం రావడం. బహుశా కన్నీళ్ళు తెచ్చిన జ్ఞాపకం నాకు కుంటాను.

నేనూ సుందరం కొత్తగా సర్వీసులో జాయిన్ అయి, ఒకే రోజున ఆఫీసులో చేరాం. ఆఫీసు సూపర్నెంటు సలహాప్రకారం "దొరగారి"ని కలుసుకోడం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం ఇద్దరం. అతన్ని రెండుగంటలు పోయాక పిలిచారు.

పదిహేను నిమిషాల తరవాత అతను కొంచెం ఎర్రబడిన ముఖంతో నాదగ్గరికి వొచ్చి, "పెళ్ళి మనిషికి అత్యవసరం కాదు....

ఆ మాట జాగ్రత్తగా జ్ఞాపకం పెట్టుకో!''....అన్నాడు తొందర తొందరగా.

ఆ విచిత్రమైన మాట ఏమిటోనని అడిగేలోపున నాకూ సెలుపు వొచ్చింది. ఆయన టీ ఇచ్చి, ఆమాట ఈమాట అడిగి, హఠాత్తుగా, "మానవుడికి పెళ్ళి అత్యవసరమా?" అని అడిగాడు.

సుందరం మాట జ్ఞాపకం వొచ్చి, "కాదు" అన్నాను.

"వెరీగుడ్!....జాలీగుడ్!" అని పొంగిపోయి, దొరగారు ఐదునిమిషాలలో నాకు సెలవిచ్చి పంపేశారు.

సుందరం అవివాహితుడు అనీ, తప్పు సమాధానం ఇచ్చి చీవాట్ల సంపుటంలాంటి ఉపన్యాసం వినాల్సివొచ్చిందనీ తరవాత తెలిసింది.

అతని సద్బుద్ధి నాకు చాలా ఆనందం కలిగించింది—మేం చాలా దగ్గరి స్నేహితుల మైపోయాం.

ఆ తరవాత సుందరం ప్రేమలో పడ్డాడు. మామధ్య రహస్యాలేమీ లేవు. అంచేత దినదినమూ అతను ఆమెనిగురించి చెప్తూనే ఉండేవాడు.

"ఇవాళ నేను వెళ్ళిపోతోంటే కన్నీళ్ళు పెట్టుకుంది" అన్నాడు ప్రణయం కొంచెం సాగిన తరవాత ఒకరోజు.

అతను ఏదో అద్భుత లోకంలో విహరిస్తున్నాడు. ఆ వయసులో ఏ అమ్మాయి ఐనా తనకోసం కన్నీళ్ళు పెడితే మనిషి ఎత్తు పది అడుగులు ఐపోతుంది. మానవుడిలో ఉన్న ఆత్మోత్కర్షకి దాహం ఎక్కువ. ఆ కన్నీళ్ళు ఆదాహాన్ని తీర్చబోతూనే ఆ ఉత్కర్షని ఎంతో ఎక్కువ చేస్తాయి. అప్పటికే నేను చక్కటి కళ్ళనీటి శక్తినిగురించి కొంత అనుభవం పొందేను. కాని, అతను నా మిత్రుడు కావడాన్న ఏమీ అనలేదు.

మరి కొంచెం రోజులుపోయాక ఆ అమ్మాయి (ఆమె పేరు మరచిపోయాను) అతను వెళ్ళేసరికి కన్నీళ్ళు కార్చడం మొదలు పెట్టింది.

ఆమాటా అతను చెప్పేడు—సంతృప్తిగా.

మరీ ఆలస్యం కాకుండానే అతనికి కొంచెం సలహా ఇద్దామనే ఉద్దేశం కలిగింది—కాని, ప్రేమ వ్యవహారాల్లో సలహా ఇవ్వడం మూర్ఖత్వం అని, చిలకా, కోతీ, మిణుగురులు కథ (ఎప్పుడూ మరుపు రాదది) నెమరువేసుకుని ఊరుకున్నాను.

తరవాత కొంతకాలం నా మిత్రుడు తన ప్రేమకథలో సంఘటనలు నాకు తెలియజేయలేదు. రెండునెలలు పోయాక హఠాత్తుగా "బ్రదర్! ఆ అమ్మాయినించి రక్షించు! నీ ఫ్లాట్‌లోకి నన్నూరానీ" అన్నాడు ఒక సాయంత్రం, నాయింటికి వొచ్చి.

"తప్పకుండా సుందరం! కాని ఏం జరిగింది?....అనవసరంగా తొందరపడకు" అన్నాను.

అతను తలపట్టుకుని కొంచెంసేపు కూర్చుని, తేరుకున్నాక తన వ్యథలకథని చెప్పేడు. సారాంశం ఇది—

ఆమె ఉండడం అతని ఇంటి కిందిభాగంలో.

ముందర ప్రారంభించిన కన్నీళ్ళు క్రమక్రమంగా అతను ఆఫీసుకి వెడుతూంటేనూ, వొస్తూంటేనూ కూడా ప్రారంభించిం ఆ అమ్మాయి.

తరవాత అతను ఆలస్యంగా కనిపించినా, తొందరగా వొచ్చినా, దుఃఖంతో, ఆనందంతో, బాధతో, కోపంతో క్లుప్తంగా- ఏ భావం కలిగినా, ఆమె కన్నీరు తప్పనిసరి ఐంది.

ఈ వరద క్రమంగా ప్రేమలో ఒక భాగం నించి, సుందరాన్ని ముంచే నదిగా మారిపోయింది.

ఈ సాయంత్రం ఆమె అతనికి రెండురోజుల తరవాత కనిపించింది. అతని గదికి వొస్తూనే—కన్నీళ్ళు.

"ఏం?" అన్నాడు సుందరం.

"రెండు రోజులు!" అంది కన్నీళ్ళతో.

ఆమె తేరుకుని, అదీ ఇదీ మాట్లాడుకున్నాక "కాలేజీ ఎలాగ సాగుతోంది?" అని అడిగేడు సుందరం.

జవాబు- కన్నీళ్ళు.

"వెళ్ళిపోయేదా?"

—చాలా కన్నీళ్ళు.

"నిన్నొదిలి ఎక్కడికీ, ఎప్పుడూ వెళ్ళను."

—ఇంకా చాలా కన్నీళ్ళు.

ఆ ప్రవాహంలోంచి ఎలాగో తప్పించుకుని వొచ్చాడు సుందరం. కథ అంతా చెప్పి, కన్నీళ్ళు పెట్టే పర్యంతం అయాడు, వారించాను.

అతని తరవాత ప్రేమకథలు ఎలాగ ఉన్నా, ఈ ఉదంతం జ్ఞాపకం వొచ్చి, సుశీలమీద గౌరవం తగ్గలేదు కదా, ఎక్కువైంది. జీవితం సాగుతూనే ఉండాలి....తన కన్నీళ్ళలో అందరినీ ముంచ నక్కరలేదు అని ఆమె తెలుసుకుంది. వీలైనంత త్వరగా ఆమె మామూలు మనిషి ఐపోయింది- ఉండి ఉండీ ఆమె కళ్ళల్లో మెదులు తోన్న నల్లమేఘాల పోలికలకి తప్ప ఈ మేఘాలు వర్షించవు.

ఆమెమీద విచిత్రమైన అభిమానం కలిగింది నాకు-యౌవనంలో దంపతులు పరస్పరం చూపుకోవాల్సిన ప్రేమకి దౌర్బల్యం మరీ రెచ్చి పోతూన్న ఈ రోజుల్లో ఎక్కడో కాని కనిపించని చిహ్నం ఆమె. వాస్తవమైన హృదయంలో ఏ మూల సున్నితమైన మధుర జ్ఞప్తు లున్నా వాటిని స్పందింపజేసే ప్రేమమూర్తి ఆమె. నా భావనలో ఆమెమీద గౌరవమూ, అభిమానమూ ఏ మాత్రం తక్కువ ఉన్నా, 'నన్ను మరచిపోకు సుశీలా! నీ మనస్సుకి ఇంత దగ్గరగా వొచ్చాను, చూడు.' అని అందును. కాని ఆ మాటలకి అప్పుడు అర్థంలేదు; అవసరమూ లేదు.

బెజవాడ చేరేదాకా ఇద్దరం ఏమీ ఎక్కువ మాటలాడుకోలేదు- త్వరత్వరగా దిగి వెనక్కి చూడకుండానే ఆమె వెళ్ళిపోయింది-నేను నొచ్చుకోలేదు. ఇంటికి వెళ్ళిపోయేను-ఒక అనుభూతిని మనస్సులో పదిలంగా దాచుకుని. ఆమె సాహచర్యం పొందిన ఆ యువకుణ్ణి అభి నందించుకున్నాను-ఎంత అదృష్టవంతుడు అనుకుంటూ. నేను చాలా సామాన్యమైన మానవుడిని. కాని, అసాధరణ ఆత్మ సౌందర్యం గుర్తించే శక్తి ఉంది నాకు.

ఆ నమ్మికవల్లనే ఆమె నాలో కొన్ని మార్పులు తెచ్చింది.

ప్రేమ వ్యవహారాలంటే హేళనగా చూడ్డం తగ్గింది నాకు. ప్రపంచంలో విలువలన్నీ మాసిపోయాయనే నిస్పృహ తగ్గింది నాలో.

ఇలాటి ఆలోచనలతోనే ఒకనాడు షికారుగా వెళ్ళి కొంచెం సేపు పార్కులో కూర్చున్నాను. ఎండ ఇంకా తగ్గకపోవడం వ[ల్ల] కాబోలు- ఎంతోమంది లేరు అక్కడ.

"నమస్కారం సార్!" అని వినిపించింది. ఆలోచనలనించి బయటికి వొచ్చి, ప్రకాశాన్ని చూశాను. అతను నా ఆఫీసులోనే ప[ని] చేస్తున్నాడు. మంచి పనివాడు- చాలా ఇష్టం నాకు.

ప్రతి నమస్కారం చేశాను.

కొంచెం అటు ఉన్న అమ్మాయిని దగ్గరికి తీసుకొ[చ్చి] "సుశీల.... లాస్టియర్ నా పెళ్ళి ఐంది జ్ఞాపకం ఉందా? మీరు రా[లే]క పోయారు" అంటూ ఆమెని పరిచయం చేశాడు.

ఆ పేరు మరచిపోలేదు కాని, ఈమె మరొక సుశీల అనే [ఆ] క్షణమాత్రం జీవించింది, ఆమె ముఖంలోకి చూసేదాకా. ఆమె నమస్కారాన్ని ఏం చేసుకోవాలో తెలియనట్లు తికమక పడ్డాననుకుంటా[ను].

"ఒంట్లో బాగాలేదా సార్?.... ఎండ...." అన్నాడు ప్రకాశం.

"అవును. ఎండ మరీ తీవ్రంగా ఉంది" అన్నాను లేచి నిలబడుతూ. "వెడతాను...."

"నేనూ వొచ్చేదా?" అన్నాడు ప్రకాశం.

"అక్కర్లేదు—బయట కారు ఉంది" అన్నాను. బయ[ల్ద]దేరుతూ అతను రోడ్డుదాకా వచ్చి తిరిగి వెళ్ళిపోతూంటే హఠాత్తుగా ఒక ఆలోచన వొచ్చి అతన్ని పిలిచేను.

"మీ—అత్తవారిది ఏ వూరు?"

"వైజాగ్...."

"సుశీల—ఎవరి అమ్మాయి!"

"పేరేంట్స్ లేరండీ...."

"పాపం.... అన్నదమ్ములు...."

"ఎవరూ లేరు—పుట్టిన దగ్గిరనించీ అమ్మమ్మ దగ్గిరే పెరి

ంది. ఇప్పటికీ ఆమెని వొదల్లేక వెడుతూ ఉంటుంది. కనీసం నెల
'కసారి."

"పాపం!" అన్నాను మరేమీ అనలేక.

"అవును. ఆమెకి అభిమానం చాలా ఎక్కువ" అన్నాడు ప్రకాశం మళ్ళీ సెలవు తీసుకుంటూ. అతను ఆ మాట చాలా గర్వంగా
ప్పేడు.

నేను కారు స్టార్టు చేసుకుని బయలుదేరాను-నెమ్మది నెమ్మదిగా.

ఎండ ఇంకా తీవ్రంగానే ఉంది....ఇందాకటికన్నాను. కాని
కి వెళ్ళి చల్లటి కోల్ తాగి మిత్రులతో బ్రిడ్జి ఆడితే, ఈ నీరసం
. కళ్ళకి చల్లగా ఉంటుంది.

మనసూ తేలిక పడుతుంది-బహుశః.

---